సాక్షి
ఒడిశా
గురువారం । 26 । జూన్ । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.1,77,201లు, బంగారం 200 మిల్లీగ్రాములు, వెండి 5గ్రాముల 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



సీఎం నివాసం ముట్టడి
రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధికారిక నివాసాన్ని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం చుట్టుముట్టారు.
- 8లో.



సారా తయారీ కేంద్రాలపై దాడులు
కాశీనగర్ బ్లాక్‌లో శిలిడ, గురుసింగి గుడ, కట్టగూడ, దిడింగూడ, తమిలిగూడ, అర్మడా తదితర గ్రామాల్లోని సారా తయారీ కేంద్రాలపై దాడులు జరిగాయి.
- 8లో.

న్యూస్‌రీల్

గిరిజనుల ఇళ్ల కూల్చివేతపై గవర్నర్‌కి ఫిర్యాదు



గవర్నర్ హరిబాబుకి వినతి పత్రం అందజేస్తున్న ప్రఫుల్ల సామంత్రాయ్ తదితరులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో గిరిజనుల ఇళ్ల కూల్చివేతపై గవర్నర్‌కి బాధితులు బుధవారం ఫిర్యాదు చేశారు. మానవ హక్కుల ఉద్యమ నేత ప్రఫుల్ల సామంత్రాయ్ నేతృత్వంలో ఉద్యమకారులు రాజ్‌భవన్‌కి వెళ్లి గవర్నర్ కంభంపాటి హరిబాబుకి వినతి పత్రం అందజేశారు. జిల్లాలోని జొరిగాం సమితి హత్తిబెడ, రాయిఘర్ సమితి నకిటి సిమెద గ్రామాలలో గిరిజనుల నివాసాలను అధికారులు కూల్చి వేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు రేగాయి. నబరంగ్‌పూర్ డీసీసీ మాజీ అధ్యక్షుడు మున్నా త్రిపాఠీతో కలసి ప్రఫుల సామంత్రాయ్ బాధిత ప్రాంతాలను సందర్శించారు. ఎటువంటి నోటీసులు లేకుండా అటవీ ప్రాంతాలో గిరిజనుల ఇళ్లను కూల్చి వేశారని గవర్నర్‌కు వివరించారు. ప్రఫుల్ల వెంట సర్వదల్‌కి చెందిన విశ్వజిత్ రాయ్, మైనింగ్ వ్యతిరేక ఉద్యమ నేత లింగరాజ్ అజాద్‌లు ఉన్నారు.

ఉద్యమానికి రెవెన్యూ ఉద్యోగులు సిద్ధం

- జూలై 7న నల్లబ్యాడ్జీలతో విధులకు..
- 14 నుంచి సమ్మెలోకి..



నబరంగ్‌పూర్ కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

కొరాపుట్: సమస్యల పరిష్కారం కోసం త్వరలో ఉద్యమానికి సిద్ధమవుతామని రెవెన్యూ మినిస్ట్రీయల్ ఉద్యోగులు వెల్లడించారు. ఈ విషయాన్ని నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రోకు బుధవారం నోటీసును అందజేశారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, బీమా రూ. 20 లక్షలు వర్తింపజేయాలని, ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబంలో అర్హత ఉన్న వ్యక్తికి ఉద్యోగం ఇవ్వాలని, ఖాళీలు భీర్తీ చేయాలని, పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉద్యమానికి సిద్ధమవుతున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా జూలై ఏడో తేదీ నుంచి నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరవుతామన్నారు. అప్పటికీ ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించకపోతే 14వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తామని ప్రకటించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి బాలాజీ సాహు, జిల్లా అధ్యక్షుడు అషుతోష్ మహంతి, మితాలి పట్నాయక్, కైలాష్ చంద్ర దాష్ ఉన్నారు.

పర్లాకిమిడిలో ఆక్రమణల తొలగింపు



రాజవీధిలో జేసీబీతో దుకాణాలను తొలిగిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: జగన్నాథ రథాయాత్రకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జిల్లా అధికార యంత్రాంగం దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా రథాయాత్ర జరుగనున్న పర్లాకిమిడి పట్టణంలోని రాజవీధి, గుండిచామందిరం, కాలేజ్ రోడ్డు, మార్కెట్ వద్ద ప్రభుత్వ భూమిని ఆక్రమించి, డ్రైనేజీలను వదలకుండా ఆక్రమించిన చిల్లర దుకాణాలు, తోపుడు బండ్లు దుకాణాలను అధికారులు బుధవారం తొలగించారు. హైస్కూల్ జంక్షన్ వద్ద పకోడి, చిరు దుకాణాలను తొలిగించారు. మరోసారి దుకాణాలను రోడ్లపై పెట్టే వారిపై జరిమానా విధించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ అనుప్ పండా హెచ్చరించారు. మార్కెట్‌కు ఇరువైపులా ఉన్న వాహనాలను కూడా తొలగించారు. ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, తహసీల్దార్ నారాయణ బెహేరా, పురపాలక సంఘం ఈవో లక్ష్మణ ముర్ము, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బీజేడీ శ్రేణుల ఆందోళన



భువనేశ్వర్‌లో వర్షంలోనే నిరసన వ్యక్తం చేస్తున్న బీజేడీ కార్యకర్తలు



నబరంగ్‌పూర్ కాలేజీ ఎదుట ఆందోళన చేస్తున్న బీజేడీ పార్టీ శ్రేణులు

కొరాపుట్: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందంటూ కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లోని విద్యాలయాల ఎదుట బీజేడీ పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. ఆ పార్టీ యువజన విభాగం బుధవారం ఇచ్చిన పిలుపు మేరకు ఈ ప్రాంతంలో కూడా ఆందోళనలు జరగ్గా.. సంఘీభావంగా పార్టీ సీనియర్ నేతలు కూడా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు నిరసనగా ఆందోళను చేపట్టారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆందోళనలో ఆ పార్టీ మాజీ ఎంపీ ప్రదిప్ మఝి మాట్లాడుతూ.. అమెరికా వంటి దేశం తమ పౌరులలో మహిళలను ఒడిశా వెళ్లవద్దని హెచ్చరికలు చేసిన దుస్థితి రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొందన్నారు. ఆందోళనలో డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, మాజీ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, తపస్ త్రిపాఠి, మంజులా మఝి పాల్గొన్నారు. కొరాపుట్ డీఏవీ కళాశాల మందు జరిగిన ఆందోళనలో జెడీ్ప ప్రెసిడెంట్ సస్మిత మెలక, మాజీ ఎంపీ జిన్ను హిక్కా, మున్సిపల్ చైర్మన్ లలిల్ శెఠి హాజరయ్యారు. జయపూర్‌లోని విక్రందేవ్ యునివర్సిటీ, డాబుగాం, ఉమ్మర్‌కోట్‌లలో జరిగిన ఆందోళనలో బీజేడీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రాయగడలో..

రాయగడ: స్థానిక అటానమస్ కళాశాల మెయిన్ గేట్ వద్ద బుధవారం బీజేడీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. మహిళలపై దాడులు పెరిగిపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా నిప్పులు చెరిగాయి. బీజేపీ ప్రభుత్వ పాలనలో మహిళలకు కనీస రక్షణ కరువయ్యిందని దుమ్మెత్తి పోశాయి. అనంతరం ముఖ్యమంత్రి మోహన్ చరణ్‌మాఝి దిష్టిబొమ్మను దహనంచేశారు. తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో బీజేడీ యువ నాయకులు వినోద్ పొలాయ్, అవినాష్ బిసాయ్, సంతోష్ దొళాయి, రాయగడ సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక తదితరులు పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: గంజాం జిల్లా గోపాల్‌పూర్‌లో విద్యార్థినిపై సామూహిక అత్యాచారం ఘటన నిరసిస్తూ విపక్ష బీజేడీ ఛత్ర పరిషత్ నాయకులు బుధవారం పర్లాకిమిడి హైస్కూల్ జంక్షన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు పెరుగుతున్నా సర్కారు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని బీజేడీ ఛత్ర సంసద్ అధ్యక్షుడు త్రిపాఠి హెచ్చరించారు. అనంతరం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసన కార్యక్రమంలో పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, బీజేడీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు బిశ్వజిత్ త్రిపాఠి, జిల్లా బీజేడీ అధ్యక్షుడు ప్రదీప్‌నాయక్, కాశీనగర్ నగర పంచాయతీ ఉపాధ్యక్షుడు రఘురాం సాహు, గుసాని జెడ్పీ సభ్యులు శాసనం బాలరాజు, కాశీనగర్ సమితి అధ్యక్షురాలు బల్ల శాయమ్మ, గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు, ఎస్.గజపతిరావు, బీజేడీ యువజన నాయకులు శాసనం లింగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కొరాపుట్ జెడ్పీ ప్రెసిడెంట్ సస్మితా మెలక



రాయగడ: ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేడీ కార్యకర్తలు



పర్లాకిమిడి: ఆందోళన చేస్తున్న పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి



భువనేశ్వర్: ముఖ్యమంత్రి ఫ్లెక్సీ దహనం చేస్తున్న విద్యార్థులు



పర్లాకిమిడి: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేడీ యువజన నాయకులు



కొరాపుట్‌లోని డీఏవీ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న దృశ్యం



ఉమ్మర్ కోట్ పెండ్రాణి విద్యాలయం వద్ద ఆందోళనలో బీజేపీ పార్టీ శ్రేణులు, విద్యార్థులు



డాబుగాం కళాశాలలో విద్యార్థుల ఆందోళన



రాయగడ:ఆటానమస్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న బీజేడీ శ్రేణులు



జయపూర్ విక్రం దేవ్ యూనివర్సిటీ ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మహిళలకు రక్షణ లేదు

- ఓపీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఓపీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్

భువనేశ్వర్: రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ విచారం వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాల అంశంపై చర్చించడానికి ముఖ్యమంత్రి ఇష్టపడటం లేదని విచారం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సమయం ఇవ్వలేదు, ఫోను సంప్రదింపులకు స్పందించ లేదు. లేఖలకు ఆయన సమాధానం ఇవ్వలేదని భక్త చరణ్ దాస్ అన్నారు. ఈ అంశంపై రాజకీయాలు చేయబోమని అయితే కాంగ్రెస్ పార్టీ మౌనంగా ఉండదని.. సమస్య పరిష్కారం అయ్యేవరకూ పోరాడుతామన్నారు.

–రాష్ట్రపతి దృష్టికి సమస్య..

మహిళల పట్ల అత్యాచారాల అంశాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ నిజ నిర్ధారణ కమిటీ రాష్ట్రంలో పరిస్థితిని వివరించాలని భావిస్తోంది. గంజాం జిల్లా గోపాల్‌పూర్, కంధమల్ జిల్లా టికాబలి, కెంజొహర్ జిల్లా హరిచందన్‌పూర్ ప్రాంతాలలో మహిళలపై జరిగిన సామూహిక అత్యాచార సంఘటనలపై నిజ నిర్ధారణ కమిటీ నేరుగా వెళ్లి ఆరా తీసింది.. పర్యటన చివరి రోజున స్థానిక కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దాస్ మున్సి మాట్లాడుతూ.. జాతీయ మానవ హక్కుల కమిషన్, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేలకు కమిటీ నిజ నిర్ధారణ నివేదికను సమర్పిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రికి మహిళల భద్రత కోసం సమయం లేనందున రాష్ట్రంలో మహిళలపై జరిగిన సామూహిక అత్యాచారం అంశాన్ని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను ఢిల్లీ స్థాయిలో లేవనేత్తుతామన్నారు.

అక్రమ మైనింగ్ అడ్డగింత



స్వాధీనం చేసుకున్న జేసీబీ

కొరాపుట్: అక్రమ మైనింగ్‌ని అధికారులు అడ్డుకున్నారు. బుధవారం సాయంత్రం కొరాపుట్ జిల్లా సిమిలిగుడ సమితి లుంగ్రి గ్రామ సమీపంలో అక్రమ మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయని అధికారులకు సమాచారం వచ్చింది. వెంటనే జిల్లా మైనింగ్ అధికారులు సిమిలిగుడ పోలీసులతో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారుల రాకను గమనించిన మైనింగ్ చేస్తున్న వ్యక్తులు అక్కడ నుంచి పరారయ్యారు. అయితే తవ్వకాల కోసం వినియోగిస్తున్న రెండు జేసీబీలు, ఒక ట్రాక్టర్‌ని అధికారులు సీజ్ చేసి సిమిలిగుడ పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. నిందితుల కోసం గాలిస్తున్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో అదరహో..



ఆస్తిక్ ప్రధాన్



ప్రతీక్ మహరణ



అంకిత మహాపాత్రో



ఓంకార్ ప్రసాద్ నొందొ

భువనేశ్వర్: జాతీయ జూనియర్ (అండర్-20) ఫెడరేషన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు విశేష ప్రతిభ ప్రదర్శించారు. ఆస్తిక్ ప్రధాన్ జాతీయ మీట్ రికార్డు నెలకొలిపాడు. 400 మీటర్ల రేసులో 46.58 సెకన్లలో లక్ష్యం ఛేదించి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. ఒడిశా అథ్లెట్ ఓంకార్ ప్రసాద్ నందా అండర్ 20 పురుషుల షాట్ పుట్ విభాగంలో రజత పతకం, జూనియర్ మహిళల హామర్ త్రో పోటీలో అంకిత మహాపాత్రో కాంస్య పతకం, పురుషుల 200 మీటర్ల పందెంలో ప్రతీక్ మహరణ కాంస్య పతకం గెలుచుకున్నారు. వీరంతా ఉజ్వల భవిష్యత్తుతో మరిన్ని విజయాలతో క్రీడా రంగంలో వెలుగొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

రథాలపై నీలచక్రాల అమరిక



నిజమందిరం నుంచి నీలచక్రాలను తీసుకువస్తున్న సబ్‌కలెక్టర్ అనుప్ పండా, సభ్యులు బసంత పండా



రథాలపై అమర్చడానికి నీలచక్రాలను తీసుకువెళ్తున్న కమిటీ సభ్యులు



జగన్నాథ, బలభద్ర రథాలపై నీలచక్రాలను అమర్చుతున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలోని శ్రీమందిరంలో నీలచక్రాలకు పండాలు శాస్త్రోత్తంగా బుధవారం పూజలు నిర్వహించారు. అనంతరం వాయిద్యాలతో వీటిని శ్రీజగన్నాథ రథం నందిఘోష, బలభద్రస్వామి రథం తాలధ్వజ, సుభద్ర రథం దర్పదళన రథాలపై అమర్చారు. దీంతో నేటి నుంచి జగన్నాథ రథంపై హనుమాన్ జెండాను ఎగురవేస్తారు. అనేక దేవతామూర్తులు రథాయాత్రకు ఆటంకం కలుగకుండా ఈ పది రోజులు కాపాడతారనేది భక్తుల విశ్వాసం. కార్యక్రమంలో రథాయాత్ర కమిటీ చైర్మన్, సబ్ కలెక్టర్ అనుప్ పండా, తహసీల్దార్ బెహేరా, రథాయాత్ర కమిటీ సభ్యులు కుమార్, బసంత పండా, భరత్ భూషన్ మహంతి, రాజేంద్ర కుమార్ బెహరా, అశోక్ మహారాణా పాల్గొన్నారు.

నేడే జగన్నాథుని నేత్రోత్సవం



రంగవల్లుల శోభతో శ్రీ మందిరం వాకిలి



శోభాయమాన జగన్నాథుడు

భువనేశ్వర్: అశేష భక్త జనం అభీష్టం నెరవేరే మధుర క్షణం చేరువైంది. నవనవలాడే యవ్వన రూపుతో ఆరాధ్య దైవం జగన్నాథుడు భక్తుల మధ్య ప్రత్యక్షం కానున్నాడు. మర్నాడు శ్రీ గుండిచా యాత్రకు బయల్దేరుతాడు. స్వామి రాక కోసం శ్రీ మందిరం గడపలో మూడు రథాలు దేవతల ఆగమనం కోసం ఆహ్వానం పలుకుతున్నాయి. ఇటు శ్రీ మందిరం, అటు శ్రీ గుండిచా మందిరం వాకిళ్ళు మొదలుకొని ఆలయ ప్రాంగణాలు సైతం శోభాయమానంగా రూపుదిద్దుకున్నాయి. గుండిచా మందిరంలో అడపా మండపం చతుర్ధాదారు మూర్తుల ఆసీనం కోసం సిద్ధమై ఉంది. భారీ రంగవల్లలతో రెండు మందిరాల వాకిళ్ల మిరమిట్లు గొలిపిస్తున్నాయి. గత 14 రోజులుగా తెరచాటున స్వామి భక్తులకు కానరాకుండా రహస్య ఉపచారాలతో సరికొత్త ఉత్సాహం పునరుద్ధరించుకోవడంతో శ్రీ క్షేత్రం హడావిడిగా ఉంది. జ్యేష్ట పూర్ణిమ నాడు అష్టోత్తర కలశ జలాభిషేకాన్ని స్నాన యాత్రగా జరుపుకున్న స్వామి తడిసి ముద్దయ్యాడు. దీంతో మూల విరాటుల సహజ రూపు చెదిరి పోయింది. జ్వర పీడతో వైద్య నియమాల ప్రకారం అనవసర మండపానికి తరలిపోయాడు. అది మొదలుకొని భక్తులకు నిత్య దర్శనం కొరవడింది. దైతపతుల ప్రత్యక్ష పర్యవేక్షణలో రాజవైద్య వర్గం తైలాది వైద్య ఉపచారాలతో దేవుళ్ల ఆరోగ్యం కోలుకుంది. యథాతథంగా భక్తులకు నిత్య దర్శనం ప్రసాదించేందుకు భగవంతునికి మార్గం సుగమం అయింది. హింగుళ (ఎరుపు), హరితల (పసుపు), కస్తూరి, కేశర (కుంకుమ), కొయిత (మారేడు గుజ్జు) వంటి సహజ మూలికా వర్ణ ద్రవ్యాల మేళవింపుతో మూల విరాటుల ముఖాలకు క్రమ పద్ధతిలో రంగులు హద్ది యవ్వన రూపం తీర్చిదిద్దుతారు. జగన్నాథుని సంస్కృతిలో ఇదో గోప్య సేవ. కాగా, గురువారం భక్తులు ప్రవేశించేందుకు శ్రీ మందిరం తలుపులు తెరుచుకుంటాయి. గుడిలో బలభద్ర స్వామి, దేవీ సుభద్ర, జగన్నాథుడు భక్తులకు దర్శన భాగ్యం కల్పించనున్నారు.

క్లుప్తంగా

గవర్నర్‌తో ఉప ముఖ్యమంత్రి భేటీ



గవర్నర్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న ఉప ముఖ్యమంత్రి

భువనేశ్వర్: గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి బుధవారం ఉప ముఖ్యమంత్రి కనక్ వర్ధన్ సింగ్ దేవ్‌తో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, ఇంధన రంగంలో సంస్కరణలు, వ్యవసాయ రంగం ప్రోత్సాహకాలు వంటి అంశాలపై చర్చ జరిగింది. ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించిన పనులను వేగవంతం చేయడానికి అన్ని విభాగాల మధ్య మెరుగైన సమన్వయం అవసరమని గవర్నర్ ప్రస్తావించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విజేతలతో నిర్వాహకులు

రాయగడ: స్థానిక ఉత్కళ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాయత్రీనగర్ వద్ద సరస్వతి శిశు మందిరంలో బుధవారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో సొనాలి ప్రధాన్ ప్రథమ, హర్షిత హిమిరిక ద్వితీయ, సంజయ్ బాగ్ తృతీయ బహుమతులు సాధించారు. సీనియర్ విభాగంలో ప్రజ్ఞాశ్రీ నందో ప్రథమ, శుభశ్రీ పండా ద్వితీయ, శుధాంశు బాల భర్తియా తృతీయ బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు దయానిధి ఖడంగా, రాయగడ మున్సిపాలిటీ వైస్ ఛైర్మన్ శుభ్ర పండా, ఉత్కళ అల్యూమినియం కర్మాగారం కార్పొరేటర్ అండ్ పీఆర్‌ఓ పీతాంబర్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల్లోకి విషసర్పాలు



ఇంటి ప్రాంగణంలో పాము

రాయగడ: జిల్లాలోని మునిగుడలో కొండప్రాంతాలకు సమీపంలోని వీధుల్లో నివసిస్తున్న ప్రజలు విషసర్పాల బారిన పడి భయాందోళనలకు గురవుతున్నారు. కొద్ది రోజులుగా విషసర్పాలు జనవాసాల్లోకి ప్రవేశించి అలజడి సృష్టిస్తున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో పొదల్లో నుంచి ఇళ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. బుధవారం తెల్లవారుజామున ప్రమోద్ సాహు అనే వ్యక్తి ఇంట్లోకి భారీ నాగుపాము చొరబడింది. దీంతో ఆ ఇంటిలోని వారు ఆందోళన చెందారు. స్నేక్‌స్నాచర్ ద్వారా పామును పట్టించి సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

సమష్టి కృషితోనే వర్సిటీ అభివృద్ధి

- వీసీ ఆచార్య కేఆర్ రజనీ
- ఘనంగా బీఆర్‌ఏయూ 18వ వ్యవస్థాపక దినోత్సవం

ఎచ్చెర్ల: అందరి సమష్టి కృషితోనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధి జరుగుతోందని వర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజనీ అన్నారు. వర్సిటీ 18వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ వెనుకబడిన ప్రాంతంలో స్థాపించిన వర్సిటీ ప్రగతిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యమయ్యేలా సంకల్పించుకోవాలన్నారు. వర్సిటీ ప్రతిష్టకు భంగం కలిగేలా ఎవరూ వ్యవహరించకూడదని సూచించారు. ఇటీవల విడుదలైన పీఎం ఉషా నిధులను వర్సిటీ బలోపేతానికి, మౌలిక వసతులు పెంచేందుకు, నూతన నిర్మాణాలకు వెచ్చించనున్నట్లు తెలిపారు. సిబ్బందికి ఎదైనా సమస్య ఉంటే తనకు నేరుగా తెలియజేయాలన్నారు. డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పరీక్షలకు అబ్జర్వర్లను నియమించాలని అంటున్నారని, అయితే ఇన్విజిలేటర్ ఉండగా పరీక్షల్లో చూచిరాతలకు తావు ఉండదని పేర్కొన్నారు. తక్కువ బడ్జెట్‌లో పరీక్షలు నిర్వహించాల్సి ఉందని, అబ్జర్వర్లను నియమిస్తే అదనపు ఖర్చు అవుతుందని పేర్కొన్నారు.

వర్సిటీతో పేదలకు ఉన్నత విద్య

వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య మాట్లాడుతూ గిరిజన, పేద వర్గాలకు ఉన్నత విద్య నందించడంలో వర్సిటీ ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత మాట్లాడుతూ గత 17 ఏళ్లలో వర్సిటీ సాధించిన విజయాలను వివరించారు. ప్రగతే ధ్యేయంగా పనిచేస్తున్న అధికారులు, వర్సిటీ వర్గాలు పరిపాలనా వ్యవస్థను దిగజార్చే పనులకు దూరంగా ఉండాలని సూచించారు. అయితే తనకు ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ శిష్యుడని, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వద్ద మంచి పేరు ఉందని చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ధ్వజం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, సమితి చైర్మన్లు, జెడ్పీటీసీ సభ్యులు

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో వివిధ సమితులు, పంచాయతీలకు ప్రభుత్వ పథకాల ద్వారా అందజేస్తున్న నిధులు గ్రామ సభలు, పంచాయతీ ప్రతినిధుల ప్రామేయం లేకుండానే అధికారులు ఆమోదం తెలుపుతున్నారని గుసాని సమితి చైర్మన్ ఎస్.వీర్రాజు, మోహనా జెడ్పీటీసీ సభ్యుడు సునీల్ కుమార్ బిషోయి, రాయఘడ సమితి అధ్యక్షురాలు పూర్ణబాసి నాయక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 53వ జిల్లా పరిషత్ సమావేశానికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ అధ్యక్షత వహించారు. జిల్లా పరిషత చైర్మన్ గవర తిరుపతి రావు, మోహనా ఎమ్మెల్యే దాశరథి గోమాంగో, పర్లాకిమిడి ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, జిల్లా పరిషత్ సి.డి.ఎం శంకర్ కెరకెటా, అదనపు పీడీ పృథ్వీరాజ్ మండల్ తదితరులు హాజరయ్యారు. గత జిల్లా పరిషత్ సమావేశాన్ని సమితి చైర్మన్లు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు బహిష్కరించారు. ఈసారి ఏడు సమితుల బ్లాక్ చైర్మన్‌లు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు. పలు ప్రభుత్వ పథకాలైన కేంద్ర ఆయుష్మాన్ భారత్, వికసిత్ భారత్, వికసిత్ ఒడిశా పథకాలకు మండలాలకు ఎంతెంత నిధులు వె వెచ్చిస్తున్నారో తెలియజేయడం లేదని పలువురు సమితి అధ్యక్షులు ఆరోపించారు. జిల్లా పరిషత్ సమావేశానికి జెడ్పీటీసీలకు కనీసం ఆహ్వానం కూడా అందలేదని మోహనా నుంచి వచ్చిన జిల్లా పరిషత్ సభ్యులు ఆరోపించారు. జిల్లాలో అనేక గ్రామాల్లో తాగునీరు, సీసీ రోడ్లు, పారిశుద్ధ్యంపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు సమితి చైర్మన్లు కోరారు.

రథయాత్రకు పోలీసు యంత్రాంగం సన్నద్ధం



రథాల వెలుపలి వలయంలో పోలీసుల భద్రత



భద్రత మధ్య రథాన్ని లాగే శిక్షణ పొందుతున్న పోలీసు బలగాలు

భువనేశ్వర్: రథయాత్రకు పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. రథాలు లాగడం మొదలుకొని యాత్ర పూర్తయ్యే వరకు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పక్కాగా ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా రథాలు లాగడంపై బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పూరీ రిజర్వు పోలీసు గ్రౌండులో చేపట్టిన ఈ కార్యక్రమం రథయాత్రను తలపింపజేసింది. బలభద్రుని తాళ ధ్వజం, జగన్నాథుని నందిఘోష్, సుభద్ర దర్ప దళనంకు ప్రతీకగా మూడు జీపుల్ని మూడు రథాల మాదిరిగా వినియోగించారు. క్లియరెన్స్, కార్డన్ ఏర్పాటు దశల్లో అనుబంధ బలగాలకు మెలకువలను నేర్పించారు. అదనపు పోలీసు డైరెక్టరు జనరల్, జిల్లా న్యాయాధికారులు, సీనియర్ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో మాక్ డ్రిల్ నిర్వహించారు.

'బాలల కోసం ఒక రోజు'

పర్లాకిమిడి: స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా శిశు సురక్షా కమిటీ (గజపతి) ఆధ్వర్యంలో బాలలకోసం ఒక రోజు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడుగురు సమితి చైర్మన్‌లు, శిశు సురక్షా సమితి సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్ గవర తిరుపతిరావు, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, జిల్లా న్యాయసలహా ప్రాధికారణ కార్యదర్శి బిమల్ రౌళో, తదితరులు పాల్గొన్నారు. గత ఏడాదిగా గజపతి జిల్లా నుంచి వివిధ రాష్ట్రాల నుంచి, విదేశీయులు 15 మంది అనాథబాలలను దత్తతగా తీసుకున్న బాలలతో వీడియా కాన్ఫరెన్సు ద్వారా వారి బాగోగులను అధికారులు తెలుసుకున్నారు. ప్రధానమంత్రి బాలల పథకం ద్వారా సహాయం పొందిన అనాధ బాలలు ఎనిమిది మంది బాగోగులు, ఆరోగ్యంపై కూడా జిల్లా అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పురపాలక చైర్మన్ నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, జిల్లా శిశు సురక్షా సమితి అధికారి అరుణ్ కుమార్ త్రిపాఠి, ఏడీఎం ఫల్గుణీ మఝి, సీడబ్ల్యూసీ చైర్మన్ అశ్వినీ కుమార్ మహాపాత్రో, జిల్లా లేబర్ ఆఫీసర్ భారతీ బెహెరా, జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి సరలా పాత్రో తదితరులు పాల్గొని బాలలతో మాట్లాడారు.

జాతీయ మార్కెట్‌లో గుర్తింపు తీసుకువస్తాం



మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి వాసన్

కొరాపుట్: తరతరాలుగా కొరాపుట్ జిల్లాలో పేరెన్నిక గల ఉత్పత్తులను జాతీయ మార్కెట్ గుర్తింపు తెస్తామని జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ ప్రకటించారు. బుధవారం కలక్టరేట్‌లో జరిగిన సమీక్షలో ప్రసంగించారు. వందల ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలో గిరిజనులు పండిస్తున్న కాలా జిర (నల్ల ధాన్యం), కొరాపుట్ కాఫీ పంట, కొట్‌పాడ్‌లో గిరిజనుల నేత చీరలు ముఖ్యమైనవని అన్నారు. ప్రభుత్వ ఎంఎస్ఎంఈ విభాగంతో కలిసి వీటి మార్కెటింగ్ దేశీయ స్థాయిలో చేస్తామన్నారు. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కొరాపుట్ బ్రాండ్‌తోనే విక్రయాలు జరుగుతాయన్నారు.

రథం నిర్మాణానికి రూ. ఒకలక్ష విరాళం



కమిటీ సభ్యులకు విరాళం చెక్కు అందజేస్తున్న రాజ ప్రతినిధి కిషన్‌కుమార్

కొరాపుట్: కొరాపుట్ జిల్లా నందపూర్ జగన్నాథ రథం నిర్మాణానికి జయపూర్ మహారాజు చంద్ర చుడ్ విశ్వేశ్వర్ దేవ్ రూ. లక్ష విరాళం అందజేశారు. బుధవారం నందపూర్ జగన్నాథ మందిర నిర్వాహణ కమిటీ పెద్దలకు జయపూర్ రాజ కోట వద్ద రాజ పరివార సిబ్బంది విరాళం మొత్తాన్ని అందించారు. నందపూర్ రాజధానిగా చేసుకొని సూర్య వంశీయులు పరిపాలన చేశారు. అనంతరం వీరు జయపూర్‌ని రాజధానిగా మార్చుకున్నారు. నాడు సూర్య వంశీయులు నందపూర్‌లో స్థాపించిన 17 దేవ దేవి పీఠాలను నేటికీ అక్కడ ప్రజలు కొలుస్తున్నారు. నందపూర్ కమిటీ సభ్యులు జగన్నాథ పంగి, భువనేశ్వర్ దళపతి, బుదు పూజారిలు జయపూర్ రాజమహాల్‌కి తరలి వచ్చారు. వీరికి రాజ మహాల్ మేనేజర్ కిషన్ కుమార్ నగదు అందజేశారు. రథయాత్ర రోజున రథం మీద ఉండే ముగ్గురు దేవతా మూర్తులకు ఇచ్చే రాజ విందుకి రాజ ప్రతినిధి హాజరవుతారని రాజ ప్రసాదం సందేశం ఇచ్చింది.

నాటుసారా స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నాటుసారాతో ఎక్సైజ్ సిబ్బంది

మందస: మండలంలోని గుడ్డికోలా గ్రామంలో గురివారి అనే మహిళ నుంచి 40 లీటర్ల నాటుసారా పట్టుకోవడంతో పాటు, సారా తయారీకి వినియోగిస్తున్న 300 లీటర్ల బెల్లంఊటను ఎక్సైజ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దీనిలో భాగంగా ఆమెను అరెస్టు చేసి సోంపేట కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు. దాడుల్లో సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సుజాత, సిబ్బంది భాను ప్రసాద్, రమణ, వెంకటేష్, ఉమాపతి, విజయ్, మార్కరావు, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌లో తొలిసారిగా రథయాత్ర



జగన్నాథస్వామి రథంపై కుంభం, చిలకలకు రంగులు అద్దుతున్న చిత్రకారుడు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ వర్సిటీలో ఈ నెల 27న జరుగనున్న రథయాత్ర కోసం జగన్నాథ రథాన్ని తయారుచేశారు. తొలి సారిగా వర్సిటీ క్యాంపస్‌లో రథయాత్రను నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్. రావు తెలిపారు. తొలుత వర్సిటీకాక ముందు జగన్నాథ్ ఇనిస్టూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మ్యానేజ్‌మెంటు ఇంజినీరింగ్ కళాశాల ఉండేది. తదనంతరం సెంచూరియన్ వర్సిటీగా రూపాంతరం చెందింది. క్యాంపస్‌లో రథయాత్రను నిర్వహించనుండటంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గంజాయి నిర్మూలనపై స్పష్టమైన ప్రణాళిక

- డీఐజీ గోపినాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: గంజాయి నిర్మూలన, నిందితుల అరెస్టు, వారి ఆస్తుల జప్తు, డీ-అడిక్షన్ సెంటర్లకు తరలింపుపై అధికారులకు స్పష్టమైన ప్రణాళిక ఉండాలని విశాఖ రేంజి డీఐజీ గోపినాథ్ జెట్టి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 5న పాడేరులో జిల్లాస్థాయి అధికారులతో సమావేశం ఉంటుందని తెలియజేశారు. గడిచిన 2024-25లో గంజా అక్రమ రవాణాపై 694 కేసులు నమోదు చేసి 40,063 కిలోల గంజాయి, 18 కిలోల హనీష్ ఆయిల్, 478 వాహనాలను స్వాధీనం చేసుకొని 1,945 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఒడిశా రాష్ట్ర ఉన్నతాధికారులతో సమావేశాలు పెడుతున్నామని, 26 స్టాటిక్ చెక్‌పోస్టుల వద్ద 183 కేసుల్లో 11,047 కిలోల గంజాయి సీజ్ చేసి 469 మందిని అరెస్టు చేశామన్నారు. అదనంగా ఉన్న 298 డైనమిక్ చెక్‌పోస్టుల వద్ద 237 కేసుల్లో 21,070 కిలోల గంజాయి సీజ్ చేసి 743 మందిని అరెస్టు చేశామన్నారు. రవాణా చేసే ఎనిమిది మంది వ్యాపారుల నుంచి రూ.9.76 కోట్ల ఆస్తులను జప్తు చేశామని, 1310 మంది గంజాయి నేరస్తుల కదలికల మీద నిఘా కోసం షీట్స్ తెరిచామన్నారు. 50 మందిపై పీడీ చట్టం, 19 మందిపై పీటీ ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగించేందుకు ప్రతిపాదించామన్నారు. రవాణాలో పాల్గొన్న 527 మందిని, గంజాయితో పాటు ఇతర నేరాల్లో పాల్గొన్న 348 మందిని ఇప్పటికే గుర్తించామన్నారు. 2024-25 కాలంలో 23 కేసుల్లో 40 మంది ముద్దాయిలకు న్యాయస్థానం 10 నుంచి 20 సంవత్సరాల జైలు శిక్ష విధించిందన్నారు.

ప్రజల వద్దకు అధికారులు



రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి అధ్యక్షతన సమావేశమైన వివిధ శాఖల కార్యదర్శులు

భువనేశ్వర్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల వద్దకు అధికారులు చేరనున్నారు. తమది ప్రజల ప్రభుత్వం అని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తరచు బహిరంగ సభల్లో ప్రకటిస్తున్నారు. ఇటీవల రాష్ట్ర గవర్నరు భారత ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ఉద్దేశించి ప్రవేశపెట్టిన పలు పథకాల పట్ల అవగాహన కొరవడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అట్టడుగు స్థాయి పాలనను మెరుగుపరచడం అనివార్యంగా అధికార యంత్రాంగం గుర్తించింది. వివిధ అభివృద్ధి పథకాల అమలును పర్యవేక్షించడానికి ఉన్నతాధికార వర్గం నడుం బిగించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా అధ్యక్షతన బుధవారం వివిధ శాఖల కార్యదర్శుల సమావేశం జరిగింది. ప్రభుత్వ సీనియర్ అధికారులు, కార్యదర్శులు వివిధ జిల్లాలు విస్తృతంగా సందర్శించాలని ప్రముఖ కార్యదర్శి ఆదేశించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర అభివృద్ధి కమిషనర్ కార్యాలయం వివరణాత్మక మార్గదర్శకాలను జారీ చేసింది.

- అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు ఏటా జూన్, ఆగస్టు మధ్య వివిధ జిల్లాలకు క్షేత్ర పర్యటనలు చేస్తారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, కార్యాచరణతో వాస్తవంగా లబ్ధిదారులకు చేరుతున్న ప్రయోజనాల్ని విశ్లేషించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఈ సందర్శనలో అధికారులు జిల్లాల్లో కనీసం 2 నుంచి 3 రోజులు బస చేసి పంచాయతీ, మండల స్థాయిలో ప్రజా స్పందనతో పాలన తీరుని సమీక్షిస్తారు. కార్యదర్శులు జిల్లా కలెక్టర్లతో సమీక్ష సమావేశాలు నిర్వహించి స్థానిక అవసరాలకు అనుగుణంగా వ్యూహాత్మక ప్రణాళికల రూపకల్పన ఈ కార్యక్రమం లక్ష్యం. దీనిలో భాగంగా అధికారులు గ్రూప్ హెల్త్ సెంటర్లు, గిరిజన రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలు, హాస్టళ్లను తనిఖీ చేస్తారు.

సీఎం నివాసం ముట్టడి



యువజన కాంగ్రెస్ కార్యకర్తలను తరలిస్తున్న పోలీసులు

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధికారిక నివాసాన్ని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం చుట్టుముట్టారు. దళితులపై అమానుష దాడులు, మహిళలపై పెరుగుతున్న దారుణాలు, శాంతిభద్రతల పరిస్థితులపై రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రంజిత్ పాత్రో ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రాజ్ మహల్ చక్ నుంచి ముఖ్యమంత్రి నివాసం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఆందోళనలో భాగంగా ముఖ్యమంత్రి అధికారిక నివాసాన్ని చుట్టుముట్టారు. ఈ పరిస్థితుల్లో పోలీసులతో ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరినీ వ్యాన్‌ముల్లో తరలించారు.

తులసి మాల రథం



పవిత్రమైన తులసి మాలలతో బుల్లి రథం రూపుదిద్దుకుంది. స్వామివారి భక్తులకు ఈ కళాఖండం అంకితం చేసినట్లు సృజనాత్మక కళాకారుడు బిశ్వజిత్ నాయక్ తెలిపారు. ఆరు రోజుల పాటు నిర్విరామంగా శ్రమించి 8 అంగుళాల ఎత్తు, 7 అంగుళాల వెడల్పుతో తయారు చేసిన ఈ రథంలో 551 తులసి మాలలు, 175 ఐస్‌క్రీం పుడకల్ని వినియోగించారు. - భువనేశ్వర్/పూరీ

మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కద్రక అప్పలస్వామి

రాయగడ: గ్రామాల్లో సరైన రహదారులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనపై అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించాలని రాయగడ ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక అన్నారు. స్థానిక సమితి కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ సమితి సభ్యులు, సర్పంచులు తమ పరిధిలో గుర్తించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, తాగు, సాగునీరుపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో సమితి చైర్మన్ టున్ని హుయిక, వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రక, సమితి సభ్యులు, సర్పంచ్‌లు, ఏబీడీఓ కాళి చరణ్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు



గజపతి, రాయగడ సరిహద్దుల్లో పట్టుబడిన సారా ఊట



దిడింగుడలో ఓ ఇంట్లో సోదాలు చేసి స్వాధీనం చేసుకున్న బెల్లం, నాటా సారా

పర్లాకిమిడి: జిల్లాలో కాశీనగర్ బ్లాక్‌లో శిరిడ, గురుసింగి గుడ, కట్టగూడ, దిడింగూడ, తమిలిగూడ, అర్మడా తదితర గ్రామాల్లోని సారా తయారీ కేంద్రాలపై గజపతి జిల్లా అబ్కారీ మరియు రాయగడ జిల్లా అబ్కారీ శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు చేపట్టారు. 7700 వాష్, 150 లీటర్ల సారా ఊటను స్వాధీనం చేసుకున్నట్టు అబ్కారీ శాఖ సూపరింటిండెంట్ ప్రదీప్ కుమార్ సాహు తెలిపారు. ఈ దాడుల్లో ఎంతమందిని అరెస్టు చేశారో తెలియజేయలేదు.

ఇరాన్‌పై దాడులను ఖండించాలి



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ఇరాన్‌పై అమెరికా దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కొన్న శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు వామపక్షాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత్ అవలంభిస్తున్న సంప్రదాయ విదేశాంగ విధానానికి అమెరికా దాడులు విరుద్ధమని దుయ్యబట్టారు. ఇరాన్‌పై దాడితో క్రూడ్ ఆయిల్ సంక్షోభం వస్తుందని, దేశ ప్రజలపై తీవ్రమైన భారాలు పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం వెంటనే అమెరికా దాడులను ఖండించాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై దాడులు అమెరికా స్వప్రయోజనాల కోసమేనని, ప్రపంచ ప్రజలు మూల్యం చెల్లించుకోవాల్సిన అవసరం లేదన్నారు. భారత్‌తో ఇరాన్ ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా వ్యవహరిస్తోందని గుర్తు చేశారు. ఈ దాడి ప్రపంచ శాంతి, సాధారణ ప్రజల జీవనోపాధిపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు ఆర్.ప్రకాశరావు, ఎ.సత్యం, ఎం.గోవర్ధనరావు, ఎం.ఆదినారాయణమూర్తి, టి.తిరుపతిరావు, ఎ.లక్ష్మి, బి.సంతోష్, ఆర్.అరవింద్, ఎ.సోమశేఖర్, పి.జగ్గారావు, పి.జనార్ధనరావు, ఎస్.సంతోష్, ఎంవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం

- అంగన్వాడీ కేంద్రం శ్లాబ్‌కు ఊడిన పెచ్చులు



పెచ్చులూడిన అంగన్వాడీ భవనాన్ని పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ హైమావతి

మెంటాడ: మండలంలోని కుంటినవలసలో రెండవ అంగన్వాడీ కేంద్రం శ్లాబ్ పెచ్చులు రాలడం ఆందోళన కలిగించింది. బుధవారం కేంద్రంలో 17 మంది పిల్లలు ఉన్నారు. అప్పుడే వచ్చిన ఆ గ్రామ యువతిపై ఆ పెచ్చులు పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన అంగన్వాడీ సూపర్‌వైపర్ హైమావతి వచ్చి ఆ పిల్లలను ఇళ్లకు పంపించారు. పిల్లలకు ఏమీకాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం శ్లాబ్ కింద పిల్లలను ఉంచి కేంద్రాన్ని నడపడంపై పలువురు విమర్శలు చేసిన పట్టించుకోక పోవడం గమనార్హం.

కూలిన వైన్‌షాపు ముందుభాగం



కూలిపోయిన మద్యం దుకాణం ముందుభాగం

బొబ్బిలి: పట్టణంలోని మేదరి బంద వద్ద గల మద్యం దుకాణ భవనం శ్లాబ్ ముందుభాగం బుధవారం కూలిపోయింది. అదృష్టవశాత్తు మద్యం కొనుగోలుకు ఆ సమయంలో ఎవరూ రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ సమాచారం అందుకున్న ఎక్సైజ్ సీఐ పి.చిన్నం నాయుడు అక్కడికి వెళ్లి దుకాణం మూసివేయించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు మద్యం దుకాణాన్ని మార్పు చేశాక తిరిగి తెరిచేందుకు అనుమతిస్తామని వ్యాపారులకు తెలియజేశారు.

గురుదేవాలో చోరీ కేసులో మరో ఇద్దరి అరెస్టు

- మిస్టరీగా మిగిలిపోయిన చోరీ సొత్తు రికవరీ



మహారాష్ట్రలో పట్టుబడిన పార్థ గాంగ్‌కు చెందిన నిందితులు

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల గురుదేవా చారిటబల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఇంట్లో గత నెల 28వ తేదీన దొంగలు చొరబడి భారీ ఎత్తున బంగారం, నగదు దోచుకుపోయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇప్పటికే మహారాష్ట్రకు చెందిన పార్థగ్యాంగ్‌లో ఒకరిని మహారాష్ట్ర వెళ్లి పట్టుకుని అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. కాగా ఇదే కేసులో మహారాష్ట్రలోని బుల్డాన్ జిల్లాకు చెందిన ముత్తుపవర్ అక్షయ్, లక్ష్మణ పవర్‌లను అరెస్టు చేసి కొత్తవలస కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ షణ్ముఖరావు బుధవారం తెలిపారు. కాగా ఇప్పటివరకు ఈ కేసులో కేవలం నిందితులను మాత్రమే పట్టుకుంటున్నట్లు పోలీసులు చూపుతున్నారే తప్ప ఎక్కడా చోరీకి గురైన సొత్తును రికవరీ చేస్తున్నట్లు చెప్పకపోవడం కొసమెరుపు. ఈ చోరీలో సుమారు 10కేజీల బంగారం,రూ 50లక్షలకు పైగా నగదు మాయమైనట్లు సమాచారం.

వ్యక్తిపై కేసు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సీఐ రవికుమార్, సిబ్బంది

భోగాపురం: మండలంలోని పెద్ద కొలువాడ బెల్టు దుకాణంపై ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు నిర్వహించారు. అనధికారికంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఎక్కడైనా బెల్టు షాపులు నిర్వహిస్తే తమకి సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది ప్రతాప్, ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

అందమే ఆనందం..!



విజయనగరం టౌన్: పెళ్లికుమార్తె ముస్తాబు చేస్తున్న బ్యూటీషియన్

- సౌందర్యానికి ప్రాధాన్యం ఇస్తున్న మహిళలు
- కాలానికి అనుగుణంగా మారుతున్న మహిళల తీరు
- ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్న సంస్థలు
- స్వయం ఉపాధికి మార్గం అంటున్న శిక్షకులు
- నేడు జాతీయ బ్యూటీషియన్ల దినోత్సవం

రాజాం సిటీ:/విజయనగరం టౌన్: అందానికి ఎవరు ఎన్ని అలంకారాలు ఇచ్చినా, ఉపమానాలు చూపినా అందమే ఆనందం అంటున్నారు మహిళలు. ఆ అందం వెనుక మరో మహిళ ఉండి ఆ అందానికే వన్నెతెస్తోంది. ఇంట్లో, వీధిలో, బంధువుల ఇళ్లల్లో జరిగే వేడుకల్లో ప్రత్యేకంగా కనిపించేందుకు మహిళలు శ్రద్ధ తీసుకుంటున్నారు. కిట్టీ పార్టీల నుంచి పెళ్లిళ్ల వరకు ఏ శుభకార్యకమైనా అతివలదే సందడి. వేడుక ఏదైనా మేకప్ అదరాల్సిందే. వారి ఆశలకు అనుగుణంగానే పట్టణాల్లో బ్యూటీ పార్లర్లు కూడా విస్తరిస్తున్నాయి. అవుట్ డోర్ షూట్‌లు, పుట్టినరోజు, నిశ్చితార్థం ఇలా వేడుక ఏదైనా వనితకు ప్రత్యేకమే. ప్రతి శుభకార్యానికి ముందస్తు వేడుక ఇప్పుడో ట్రెండ్‌గా మారిపోయింది. అప్పటికప్పుడు పార్టీలకు వెళ్లేందుకు సైతం అభిరుచికి తగ్గట్టు మగువల అందానికి బ్యూటీషియన్లు మరింత వన్నె తెస్తున్నారు.

నేడు జాతీయ బ్యూటీషియన్ల దినోత్సవం

మహిళలు, విద్యార్థినులు సైతం అందానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో ఉన్న పాశ్చాత్య ధోరణి ఇప్పుడు పల్లెలకు సైతం పాకింది. పట్టణాల్లో ఏర్పాటుచేసిన బ్యూటీ పార్లర్లు కూడా మగువల అభిరుచులకు తగ్గట్టు నిర్వహణ చేపడుతున్నారు. ఇదిలా ఉండగా కొద్దో గొప్పో బ్యూటీషియన్ కోర్సులు నేర్చుకున్న వారికి ఓ ఆదాయ వనరుగా కూడా కలిసొస్తోంది. ఇంటి వద్దే ఉంటూ నాలుగు డబ్బులు సంపాదించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. పట్టణం నుంచి పల్లెల వరకు నేడు మహిళలు, చిన్నారులు సైతం అందంపైనే మక్కువ చూపుతున్నారు. ఇంట్లో చిన్న చిన్న వేడుకలతో పాటు పెళ్లిళ్ల సీజన్‌లో నిశ్చితార్థం మొదలుకుని ఫొటోషూట్, పెళ్లి తంతు ముగిసే వరకు మగువలు అందంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారితో ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. బ్రైడల్ మేకప్, శారీ డ్రాపింగ్, కేశాలంకరణ ఇలా ఎక్కడా మేకప్ విషయంలో రాజీపడడంలేదు.



నైరెడ్‌లో బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఆదాయ వనరుగా..

బ్యూటీషియన్ కోర్సు చేసిన మహిళలకు ఇంటి వద్దే ఆదాయవనరుగా బ్యూటీ పార్లర్లు కలిసివస్తున్నాయి. ప్రతి నిత్యం ఐ బ్రో అందంగా తీర్చిదిద్దడంలో మెలకువలు పాటిస్తూ ఆదాయమార్గాలను అన్వేషిస్తున్నారు. మహిళల ఆసక్తిని, అభిరుచిని గమనించి బ్యూటీ పార్లర్లలో ప్రత్యేక అలంకరణ చేస్తున్నారు. సింగిల్ ప్యాకేజీ, హోమ్ సర్వీసెస్ ద్వారా మగువలు వారి అందాన్ని మరింత మెరుగుపరుచుకుంటున్నారు. శరీరతత్వం, మనిషిరంగు, వేడుకను బట్టి వారికి అమరేలా మేకప్ చేస్తున్నారు. మేకప్ రకం, వాడే మెటీరియల్ బట్టి పారితోషికం కూడా తీసుకుంటున్నారు. ఒక్కోసారి ఇళ్లకు తీసుకువెళ్లి మేకప్ చేయించుకునేందుకు బ్యూటీషియన్లతో ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. ఇళ్లకు వెళ్లి మేకప్ చేసేందుకు సైతం మెటీరియల్‌కు అనుగుణంగా రూ.4 వేల నుంచి రూ.10వేల వరకు రేట్లు నిర్ణయించి ఆదాయం సంపాదిస్తున్నారు.



మెలకువలు నేర్పుతున్న శిక్షకులు



విజయనగరం టౌన్: ఫేషియల్ చేస్తున్న దృశ్యం

శిక్షణతో ప్రోత్సహిస్తున్న సంస్థలు..

మహిళలకు ఉపాధిమార్గాలు చూపేందుకు శిక్షణ సంస్థలు కూడా బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నాయి. దీంతో మహిళలు కూడా ఆసక్తి కనబరిచి శిక్షణ పొందుతున్నారు. అలాగే బ్యూటీ పార్లర్లలో పనిచేసుకుంటూ చిన్నచిన్న చిట్కాలను, మెలకువలను సైతం నేర్చుకుంటూ సొంతంగా పార్లర్లను ఏర్పాటు చేసుకుంటూ తమ కాళ్లపై తాము నిలబడగలుగుతున్నారు.

21 వేల మంది వరకు శిక్షణ..

జీఎంఆర్ నైరెడ్ సంస్థ ద్వారా ఇప్పటివరకు వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 21432 మందికి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ అందించాం. యువతులు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఇదో చక్కని అవకాశం. పదో తరగతి చదివి ఖాళీగా ఉన్నవారందరినీ ఉపాధిమార్గాలవైపు ప్రోత్సహిస్తున్నాం. ఇందులో భాగంగా అందిస్తున్న బ్యూటీషియన్ కోర్స్‌లో చేరి మెలకువలు తెలుసుకుంటున్నారు. సంస్థ స్థాపించిన తరువాత నిర్విరామంగా యువతకు ఉపాధి శిక్షణను ఉచితంగా అందిస్తున్నాం.

ఎం.రాజేష్, డైరెక్టర్, జీఎంఆర్ నైరెడ్, రాజాం.

విబా ద్వారా ఉచిత శిక్షణ



విజయనగరం బ్యూటీ అసోసియేషన్ ద్వారా ఆసక్తి ఉన్న మహిళలకు, యువతకు ఉచిత శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. మహిళలకు లబ్ధి చేకూర్చే బ్యూటీషియన్ కోర్సు నేర్చుకునేందుకు దూరప్రాంతాలకు వెళ్లేవారు. ఇప్పుడు అటువంటి వారందరూ విజయనగరం జిల్లా కేంద్రంలోనే శిక్షణ తీసుకునేందుకు అనువుగా విబా ఏర్పాటుచేశాం. అసోసియేషన్ ఇక్కడ ఉండడం వల్ల పెద్దపెద్ద బ్యూటీ కంపెనీలు ఉచిత తరగతులను అందించేందుకు ముందుకు వస్తుండడం ఆనందంగా ఉంది.

–బోని భాగ్యలక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షురాలు, విజయనగరం బ్యూటీషియన్స్ అసోసియేషన్, విజయనగరం.

స్వయం ఉపాధి దిశగా



బ్యూటీపార్లర్ అంటే పూర్వం ఒకరోజు మేకప్ అనుకునేవారు. ఫంక్షన్‌లకు మాత్రమే పార్లర్‌కి వెళ్లేవారు. కానీ ఇప్పుడు హెల్త్ కేర్ హెయిర్ నుంచి కాలి గోరు వరకూ పార్లర్‌లో లేటెస్ట్ ఎక్విప్‌మెంట్స్, కాస్మోటిక్ చాలా ఖరీదైన సర్వీస్ అందుబాటు లోకి వచ్చాయి. ప్రతిఒక్కరూ అందంగా ఉండడం ఆత్మవిశ్వాసంగా భావిస్తున్నారు. దానివల్ల బ్యూటీపార్లర్ అంటే ఒక చిన్న చూపు నుంచి స్వయం ఉపాధిగా మారింది. సంఘంలో గౌరవం కూడా పెరిగింది.

–జంపన అరుణ, జేకే. బ్యూటీ క్లినిక్, విజయనగరం

పోలీస్ వెల్ఫేర్ పాఠశాలలో టీచర్ పోస్టుల భర్తీ

- దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోదలచిన అభ్యర్థులు తమ విద్యార్హతలతో పాటు, కచ్చితంగా ఆంగ్లంలో విద్యాబోధన చేయగలిగిన సామర్థ్యం ఉండాలని స్పష్టం చేశారు. ఉద్యోగ ఖాళీలు, విద్యార్హత వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

ప్రీ ప్రైమరీ ఉపాధ్యాయ ఉద్యోగం 1:
డీఈడీ లేదా బీఈడీ విద్యార్హతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి

2వ తరగతి కోసం సింగిల్ మదర్ టీచర్ ఉద్యోగం 1
సింగిల్ మదర్ టీచర్‌గా పని చేసేందుకు డీఈడీ, లేదా బీఈడీ అర్హతతో పాటు అన్ని సబ్జెక్టులను బోధించగలగాలి

3 నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు సబ్జెక్టును బోధించేందుకు ఉపాధ్యాయ ఉద్యోగం ఖాళీ 1
డీఈడీ లేదా బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలి

6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గణితం బోధించేందుకు ఉపాధ్యాయ ఉద్యోగం ఖాళీ 1
బీఈడీ విద్యార్హత కలిగి ఉండాలి



పోస్టుల భర్తీ వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఖాళీ 1
కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేందుకు బీఎస్సీ లేదా బీకాం లేదా ఇతర కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన డిగ్రీ లేదా సర్టిఫికెట్ కోర్సులను అర్హతగా కలిగి ఉండాలి.

తోటమాలి ఖాళీ 1
పాఠశాలలో తోటమాలిగా పని చేసేందుకు ఆసక్తి కలిగిన వ్యక్తులు దరఖాస్తు చేసుకోవచ్చు

పైన తెలిపిన ఉద్యోగాలను భర్తీ కోసం ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీన ఉదయం 10గంటలకు విజయనగరం కంటోన్మెంట్ పోలీస్ క్వార్టర్స్ సమీపంలో గల పోలీస్ వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో జరిగే ఇంటర్వ్యూ, డెమో క్లాసులకు నేరుగా హాజరుకావచ్చని ఎస్పీ పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, సందేహాల నివృత్తి కోసం స్కూల్ ఆఫీసు నంబర్లు 9441022874, 6305883484 లేదా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ 9121109485, వెల్ఫేర్ ఆర్ఎస్సై 9121109484 నంబర్లను సంప్రదించ వచ్చని ఎస్పీ వకుల్ జిందల్ సూచించారు.

నేడు ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా బాల, బాలికల ఎంపిక పోటీలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య శిక్షకుడు డీవీ.చారి ప్రసాద్ బుధవారం తెలిపారు. నగరంలోని విజ్జి స్టేడియంలో ఉదయం 9 గంటల నుంచి అండర్ -10, 12 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో అండర్-10 విభాగంలో 2016 జనవరి 1వ తేదీ అనంతరం, అండర్-12 విభాగంలో 2014 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించిన క్రీడాకారులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులుగా స్పష్టం చేశారు. క్రీడాకారులు విధిగా ఫెన్సింగ్ అసోసియేషన్ గుర్తింపు కార్డు వెంట తీసుకు రావాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 29వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని మరిన్ని వివరాలకు ఫోన్ 8374737707 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

10 మద్యం బాటిల్స్ స్వాధీనం

బొబ్బిలిరూరల్: మండలంలోని పక్కి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ పి.చిన్నం నాయుడు తెలిపారు. బుధవారం మద్యం బెల్ట్ దుకాణాల తనిఖీకి వెళ్తుండగా 10 మద్యం బాటిల్స్‌తో పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేసి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలసలో అక్రమంగా సారా విక్రయిస్తున్న చోడిపల్లి రాజు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని విక్రయానికి సిద్ధంగా ఉంచిన 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి తెలిపారు. ఈ మేరకు పట్టుబడిన వ్యక్తిని, స్వాధీనం చేసుకున్న సారాను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు భద్రతకు బైక్స్

- అత్యాధునిక టెక్నాలజీతో తయారీ
- జిల్లాకు వచ్చిన 16 బైక్స్

విజయనగరం క్రైమ్: జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ, రహదారి భద్రత కోసం కొత్తగా 16 మోటార్ సైకిల్స్ జిల్లా కేంద్రానికి వచ్చాయని ఎస్పీ వకుల్ జిందల్ బుధవారం తెలిపారు. డీజీపీ ఆఫీస్ నుంచి జిల్లాకు వచ్చిన బైక్స్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఆ బైక్స్‌ను ఉపయోగిస్తామన్నారు. వాటిలో 15 టీవీఎస్ అపాచీ మోటార్‌సైకిల్స్, ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఉన్నాయని తెలిపారు. ఈ మోటార్ సైకిల్స్‌ను సైరన్, బ్లింకర్స్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం, క్రౌడ్ కంట్రోల్ చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించారన్నారు. జిల్లాలో ట్రాఫిక్ అవాంతరాలు తరచూ ఏర్పడుతున్న పోలీస్‌స్టేషన్లకు అలాగే రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్న స్టేషన్లకు వాటిని కేటాయించనున్నా మని తెలిపారు. ఫోర్‌వీలర్స్ వెళ్లలేని మారుమూల ప్రాంతాలకు కూడా ఈ మోటార్ సైకిల్స్ వినియోగించి, పోలీస్ సిబ్బంది, అధికారులు చేరుకునే అవకాశముంటుందన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని, ప్రమాదాల నియంత్రణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎస్పీ వకుల్ జిందల్ పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు ఏవీ లీలారావు, ఆర్వీఆర్కే చౌదరి, ఆర్ఎస్సై(ఎంటీఓ) ఆర్.రమేష్ కుమార్, ఆర్ఎస్సై (అడ్మిన్) ఎన్.గోపాలనాయుడు పాల్గొన్నారు.



జిల్లాకు వచ్చిన మోటార్ సైకిల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సంజీవకుమార్

సాక్షి ఎఫెక్ట్

పూసపాటిరేగ: పూసపాటిరేగ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సంజీవ కుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. సాక్షి దినపత్రికలో 'తహసీల్దార్ ఎక్కడ?' శీర్షికన బుధవారం కథనం వెలువడింది. దీనిపై స్పందించిన రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు పూసపాటిరేగ డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సంజీవకుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. పదిరోజులుగా తహసీల్దార్ కార్యాలయంలో ఎటువంటి రెవెన్యూ సేవలు అందకపోవడంతో విద్యార్థులు, వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. ఎట్టకేలకు తహసీల్దార్ బాధ్యతలు ఇన్‌చార్జికి అప్పగించడంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారం కానున్నాయి.

జిల్లా వేదికగా జాతీయ చెస్‌పోటీలు

- ఈనెల 28 వరకు జరగనున్న దివ్యాంగుల జాతీయ చెస్ చాంపియన్‌షిప్
- పోటీలకు హాజరైన 16 రాష్ట్రాలకు చెందిన 150 మంది క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయి చెస్ పోటీలకు విజయనగరం వేదికగా నిలిచింది. ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం సారథ్యంలో నిర్వహించ తలపెట్టిన 5వ జాతీయ స్థాయి దివ్యాంగుల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని మెసానిక్ టెంపుల్‌లో నిర్వహిస్తున్న పోటీలను స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీలు విజయనగరంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి పోటీలకు వచ్చిన క్రీడాకారులను ఆమె అభినందించారు. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా కార్యదర్శి కేవీ జ్వాలాముఖి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలకు చెందిన 150 మంది దివ్యాంగ క్రీడాకారులు మంగళవారం జిల్లాకు చేరుకున్నారన్నారు. వారందరికీ మంగళవారం అన్ని రకాల మెడికల్ చెకప్ చేశామని చెప్పారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు అంతర్జాతీయ పోటీలకు వెళ్లనున్నారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాలకు చెందిన దివ్యాంగ క్రీడాకారులు

ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెరగాలి

- జిల్లావ్యాప్తంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలి
- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరగాలని, గురువారం జిల్లావ్యాప్తంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డిజిటల్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, వీఆర్‌ఓలు, ఉపాధ్యాయులు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనాలని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 4,132 మంది 1వ తరగతి విద్యార్థులు తక్కువగా ఉన్నారని, అవన్నీ ఈ డ్రైవ్ ద్వారా భర్తీ కావాలని తేల్చిచెప్పారు. ఇప్పటికే పాఠశాలల్లో చేరి ఆన్‌లైన్‌లో నమోదు కాని వారి వివరాలను రానున్న రెండు రోజుల్లో పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఇందుకు తల్లితండ్రులకు అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలని, డ్రాపౌట్ విద్యార్థులను కూడా బడిలో చేర్పించేలా ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో తల్లికి వందనం కార్యక్రమంపై విద్యాశాఖాధికారులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలెక్టర్ సమీక్షించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో పాటు అన్ని వసతులు కల్పించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అడ్మిషన్లు పెరగాలని, ఆ దిశగా తల్లితండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ్‌కుమార్, నోడల్ అధికారి డి.మంజులవాణి, ఐసీడీఎస్ పీడీ డా.టి.కనకదుర్గ, ఎంఈఓలు, కళాశాలల ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్

27న సుపరిపాలన కార్యక్రమం

సుపరిపాలన కార్యక్రమం ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. 27వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్థక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సమావేశంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.సుధారాణి, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎస్.మన్మథ రావు, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా విపత్తు స్పందన/అగ్నిమాపక అధికారి పి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి వట్టిగెడ్డ పాత బ్రిడ్జి సమీపంలో చెట్టుకు ఉరివేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం జీగిరాం గ్రామానికి చెందిన నూలక ప్రశాంత కుమార్(26) లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఇదివరకే వివాహం జరిగి ఇద్దరు పి ల్లలు ఉండగా భార్యతో విడాకులు తీసుకున్నాడు. తరువాత తల్లిదండ్రుల వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ప్రశాంత కుమార్ మరో అమ్మాయితో ప్రేమలో పడి ఆమెను ఇంటికి తీసుకొస్తానని తల్లిదండ్రులతో చెప్పగా వద్దని మందలించారు. దీంతో ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి బ్యాగ్‌తో వెళ్లిపోయి కొట్టక్కి బ్రిడ్జి వద్ద తన షర్ట్‌తో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లిదండ్రులు పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల గ్రామాల్లో కూడా వాకబు చేశారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తమ కుమారుడు అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం కొట్టక్కికి చెందిన పశువుల కాపరి చెట్టు కింద కుళ్లిపోయి దుర్వాసన కొడుతూ కింద పడి ఉన్న మృతదేహాన్ని చూసి గ్రామ వీఆర్వో మహేష్‌కు సమాచారం ఇచ్చాడు. ఈ మేరకు వీఆర్వో పరిశీలించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.ఎ సమాచారం అందిన వెంటనే సీఐ కె.నారాయణరావు, ఎస్సై వి.ప్రసాదరావు, ఏఎస్సై అప్పారావులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద పడి ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా జీగిరాం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి బ్యాగుతో పాటు అందులో ఉన్న బట్టల ఆధారంగా తమ కుమారుడేనని గుర్తించి భోరున విలపించారు. మృతదేహం తీయలేని దుస్థితిలో ఉండడం వల్ల పోలీసు అధికారులు ఘటనా స్థలంలోనే బాడంగి సీహెచ్‌సీ వైద్యాధికారితో పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబసభ్యుల సమక్షంలో అక్కడే ఖననం చేశారు. ఎస్సై వి.ప్రసాదరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రశాంత్ కుమార్ (ఫైల్)



ఘటనాస్థలంలో ప్రశాంతకుమార్ మృతదేహం

జూట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల: నెల్లిమర్ల జూట్ మిల్లు రిటైర్డ్ కార్మికుల గ్రాట్యుటీ సమస్య పరిష్కరించకుంటే ఆందోళన చేస్తామని వీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ హెచ్చరించారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు మైపాడ ప్రసాద్, రిటైర్డ్ కార్మికులతో కలిసి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీకాంత్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్‌కోర్ట్ ఆదేశించినా మిల్లు యాజమాన్యం ఎందుకు గ్రాట్యుటీ చెల్లింపులు చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో గత తహసీల్దార్ పూర్తిగా నిర్లక్ష్యం వహించారని ఆరోపించారు. దీంతో వారంతా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సమస్య వెంటనే పరిష్కరించకుంటే కార్మికులతో కలిసి ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆల్తి నల్లిబాబు, ఉపాధ్యక్షుడు కళ్యాణం బాలకృష్ణ పాల్గొన్నారు.